సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
డిజిటల్
గురువారం, మే 23, 2024





- సంచలన విషయాలు బయటపెట్టిన ఏసీబీ
- ఫిర్యాదుదారులకే బెదిరింపులు
- సివిల్ కేసులన్నీ.. క్రిమినల్ కేసులుగా మార్చి వేదింపులు
- వ్యవహారాలన్నీ ల్యాప్‌టాప్‌లో లభ్యం
- రూ.50కోట్లకు పైగా అక్రమ ఆస్తులున్నట్లు గుర్తించిన ఏసీబీ

2 లో..

## ఉమామహేశ్వర్ కేసులో కొత్త ట్విస్ట్

# పోలీసులే బీనామీలు

3 లో..



# కాళేశ్వరంపై పూర్తి వివరాలివ్వండి

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342

# పోలీసులే బినామీలు

- సంచలన విషయాలు బయటపెట్టిన ఏసీబీ
- ఫిర్యాదు దారులకే బెదిరింపులు
- సివిల్ కేసులన్నీ.. క్రిమినల్ కేసులుగా మార్చి వేదింపులు
- వ్యవహారాలన్నీ ల్యాప్‌టాప్‌లో లభ్యం
- రూ.50కోట్లకుపైగా అక్రమ ఆస్తులున్నట్లు గుర్తింపు

## ఉమామహేశ్వర్ కేసులో కొత్త ట్విస్ట్







**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** ఉమామహేశ్వర్ ఏసీబీ కేసులో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. పలువురు పోలీస్ అధికారులతో కలిసి బినామీ వ్యాపారాలు చేసినట్లు ఏసీబీ గుర్తించింది. సందీప్ అనే పేరుతో ఉమామహేశ్వరరావు పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. ఉమామహేశ్వరరావు ల్యాప్ టాప్ అవినీతి చిట్టాతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎవరి దగ్గర నుంచి ఎన్ని డబ్బులు తీసుకున్నాం.. ఎవరి దగ్గర నుంచి ఎన్ని డబ్బులు రావాలని.. వివరాలను ఉమామహేశ్వర్ లాప్ టాప్ లో పొందుపరిచినట్లు అధికారులు గుర్తించారు.

**ఫిర్యాదు ఇచ్చిన వారికే బెదిరింపులు..**

ప్రతినిత్యం తన వెంటే లాప్ టాప్ పెట్టుకొని తిరిగేవాడని వెల్లడించారు. లాప్ టాప్ లో దొరికిన వివరాల ఆధారంగా ఏసీబీ విచారణ చేపట్టింది. సీసీఎస్‌లో అంతా తానే నడిపించినట్లు గుర్తించారు. పలు కీలకే కేసుల సంబంధించిన విచారణ అధికారిగా ఉమామహేశ్వర్ ఉన్నట్లు గుర్తించారు. ఫిర్యాదు ఇచ్చిన వారికే బెదిరింపులకు పాల్పడి వసూళ్లకు పాల్పడ్డాడని గుర్తించారు. ఉమామహేశ్వర్ చేసిన అక్రమాల పైన పూర్తిస్థాయిలో ఏసీబీ దర్యాప్తు చేస్తున్నది. బంజారాహిల్స్ ఏసీబీ హెడ్ క్వార్టర్స్ నుంచి ఉమామహేశ్వర్ ను నాంపల్లి కోర్టుకు ఏసీబీ అధికారులు తరలించారు.

**సివిల్ కేసులు, క్రిమినల్ కేసులుగా మార్చి బెదిరింపులు..**

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న అభియోగాలపై ఉమామహేశ్వర రావు ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. కాగా.. ఉమామహేశ్వర రావు అక్రమ భాగోతాలు ఒక్కొక్కటి బయటపడుతుంది. న్యాయం కోసం వెళ్లిన బాధితులకు చుక్కలు చూపించినట్లు దర్యాప్తులో తేలింది. ఉమామహేశ్వర రావు వ్యవహార శైలిపై గతంలోనూ అనేక ఫిర్యాదులు అందాయని పేర్కొంది. తనపై ఇప్పటికే మూడుసార్లు సస్పెన్షన్ వేటు పడినట్లు వెల్లడించింది. అయినా ఉమామహేశ్వరరావు తీరు మార్చుకోలేదని ఏసీబీ వివరించింది. సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా మార్చి లక్షల రూపాయలు జేబులో వేసుకున్నట్లు అధికారులు బయటపెట్టారు. సీసీఎస్ లో బాధితులకు న్యాయం చేయాల్సిన హోదాలో ఉంటూ వారితోనే బేరసారాలు జరిపారని ఏసీబీ బట్టబయలు చేసింది.

**రూ.50కోట్ల మేర అక్రమ ఆస్తులు..**

ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఒక ఎన్నారై ను సైతం బెదిరించి డబ్బులు దండుకున్నట్లు వెల్లడించారు. ఉమా మహేశ్వరరావు బూతు పురాణంపై సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. తోటి సిబ్బంది నీ సైతం తిట్లతో అవహేళన చేసిన సందర్భాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు పేర్కొంది. తన దగ్గరికి వచ్చిన ప్రతి కేస్ లోనూ ఉమా మహేశ్వరరావు చేతివాటం చూపించాడని, అక్రమ ఆస్తుల కూడబెట్టుకుని నగర శివారులో విలాసవంతమైన విల్లాలు కొనుగోలు చేసినట్లు వెలుగులోకి వచ్చాయి. తన ఇంట్లో నగదు ఉంచకుండా, తన అత్త మామల ఇంట్లో డబ్బును ఉంచినట్లు సమాచారం. లావాదేవీలు మొత్తాన్ని ట్యాబ్ లో రాసుకున్నారని, బహిరంగ మార్కెట్ లో రూ.50 కోట్ల మేర అక్రమ ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు.

### 14 రోజులు రిమాండ్

ఉమామహేశ్వరరావును అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు బుధవారం కోర్టులో హాజరుపర్చారు. ఏసీబీ కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఉమామహేశ్వరరావును చంచల్‌గూడ జైలుకు తరలించారు.

---

# 1962 అంబులెన్స్‌ల తనిఖీ



**తెలంగాణ ప్రభ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సంచార పశు వైద్యశాల 1962 అంబులెన్స్‌లను తెలంగాణ 1962 స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బగీశ్ మిశ్రా,108 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం, రాజన్న సిరిసిల్ల జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పశువుల వైద్యానికి ఉపయోగించే అత్యవసర మందులు, వాటిపై ఉన్న ఎక్స్పైరీ తేదీ, పశువుల వైద్యానికి ఉపయోగించే పరికరాల పనితీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.. అనంతరం సిబ్బంది పనితీరు పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. పశువులకు వస్తున్న రోగాలు ఏంటి వాటికి అందిస్తున్న చికిత్సలపై ఆరా తీశారు. వాహనాలలోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ రవి కుమార్, డాక్టర్ ప్రేమ్ చంద్, పారవిట్ ప్రవీణ్ కుమార్, మణిసాయి, కెప్టెన్ నరేష్, దిలీప్, హెల్పర్ ప్రశాంత్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.








# కాళేశ్వరంపై పూర్తి వివరాలివ్వండి



- సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా
- ప్రాజెక్ట్ సమగ్ర వివరాలను వెంటనే అందించాలని ఆదేశం
- న్యాయం విచారణ కమిటీకి అందించేలా ఉండాలని ఉత్తర్వులు


**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్లానింగ్ నుంచి కుప్ప కూలడం, మురుగు కాల్వలు ఏర్పాటయ్యే వరకు సమగ్ర వివరాలను వెంటనే అందించాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా నీటిపారుదల శాఖ సంబంధిత ఇంజినీర్లను ఆదేశించింది. బ్యారేజీల నిర్మాణ స్థలానికి సంబంధించి ఇచ్చిన మొదటి ఆమోదం, తదుపరి మార్పు, ఈ మార్పులను ఎవరు ఆమోదించారు? మూడు నిర్మాణాలను బ్యారేజీలుగా తీసుకున్నారా? లేదా డ్యామ్‌లుగా తీసుకున్నారా? అందరికీ ఒకే డిజైన్లను అమలు చేశారా? వంటి వివిధ అంశాలకు సంబంధించిన వివరాలను కోరారు. మూడు, పనులు ప్రారంభించే ముందు సమగ్ర అధ్యయనం చేశారా? తదితర అంశాలకు సంబంధించిన డిజైన్లు, నిర్మాణం, నాణ్యత పరిశీలన, అధీకృత, అనధికార సబ్ కాంట్రాక్టర్లు, కార్యకలాపాలు, నిర్వహణ, కాంట్రాక్టర్లకు అయాచిత ప్రయోజనాలు, జారీ చేయడం వంటి పలు అంశాలపై పత్రాలను కోరింది.

**న్యాయ విచారణ కమిటీకి అందించేందుకు వీలుగా ఉండాలి..**

పనులు పూర్తికాకముందే సర్టిఫికెట్లు తదితరాలు.. ఈ మేరకు ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్), ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ఇంజినీర్ ఇన్ చీఫ్, కాళేశ్వరం (రామగుండం), నాణ్యతపై రాహుల్ బొజ్జా వివరాలు కోరారు. నీటిపారుదల శాఖ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్. అత్యవసరంగా పరిగణించి ఈ నెల 25లోగా వివరాలు సమర్పించాలని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై న్యాయ విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్.. ఈ పత్రాలన్నింటినీ కమిషన్‌కు సమర్పించేందుకు వీలుగా ఇవ్వాలని కోరారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డపై సమీక్ష సందర్భంగా రికార్డులన్నీ కమిషన్ కు అందజేయాలని, కొన్ని పత్రాలను పక్కన పెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో కార్యదర్శి ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## ఉచితంగా కంటి ఆరోగ్య పరీక్షలు

**తెలంగాణ ప్రభ, కోటగిరి :** కోటగిరి మండల కేంద్రంలోని లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించబడతాయని లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగినేని హనుమంత రావు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బోధన్ లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ వారి కంటి వైద్యులచే మండలంలోని గ్రామాల ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించుతామని అన్నారు. మోతి బిందు ఉన్న వారిని గుర్తించి బోధన్ లైన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేయబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు అనిల్ కంటి వైద్యులు డాక్టర్ సతీష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి

## వెంకటరామిరెడ్డి గెలుపు తథ్యం

**బీఆర్ఎస్ దౌల్తాబాద్ గ్రామ అధ్యక్షుడు హజ్మత్ అలీ**

**తెలంగాణ ప్రభ, నర్సాపూర్ :** మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి చేసిన సేవలే గెలిపిస్తాయని ఆ పార్టీ దౌల్తాబాద్ గ్రామ అధ్యక్షులు అజ్మత్ అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కలెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి మారుమూల గ్రామాలలో విద్యార్థులకు ఆర్థిక పరిస్థితులు బాగాలేక చదువులో వెనుకబడిన పిల్లలను గమనించిన ఆయన రూ.వంద కోట్లతో ట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు చదువును అందించేందుకు ముందుకు వచ్చాడని ఆయన అన్నారు. ఈ సేవా కార్యక్రమాలు చేస్తానని ఏ నాయకుడు ముందుకు రాలేదన్నారు. పేద ప్రజల కోసం తనసొంత డబ్బులతో ఫంక్షనల్ నిర్మించి ఒక రూపాయికి ఇస్తానని వెంకటరామిరెడ్డి అనడం ఎంతో సంతోషకర మన్నారు. మెదక్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గం దాదాపు 30, 40 వేల మెజార్టీ వెంకటరామిరెడ్డికి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే 4 తేదీనా బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకోవడం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.







# 29, 30తేదీల్లో ధర్నా చేస్తాం

- మేడారం పూజార్ల హెచ్చరిక
- స్థల వివాదమే కారణం

**తెలంగాణ ప్రభ, వరంగల్:** వరంగల్‌లో మేడారం పూజారులు ఆందోళనకు సిద్ధమయ్యారు. వరంగల్‌లో ధార్మిక భవనం స్థలం విషయంలో మేడారం పూజారులు, దేవాదాయ వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మేడారం పూజారులు నిరసనలకు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. మేడారం జాతర భవిష్యత్ అవసరాల కోసం 1993లో అప్పటి ప్రభుత్వం వరంగల్‌లోని రంగంపేటలో 1000 గజాల స్థలాన్ని కేటాయించింది. అయితే.. ఈ స్థలంలో ఏడాది క్రితం భద్రకాళి, మెట్టుగుట్ట, మేడారం జాతర నిధులతో ధార్మిక భవనాన్ని నిర్మించారు. అనంతరం వివిధ ఆలయాల కార్యనిర్వహణాధికారుల కార్యాలయాల వారు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ధార్మిక భవనాన్ని, స్థలాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని మేడారం అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది మేడారం సమ్మక్క, సారక్క దేవతలకు కేటాయించిన స్థలమని మేడారం పూజారులు స్పష్టం చేశారు. ఈ విషయమై.. మంత్రులు, జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. మే 29, 30 తేదీల్లో మేడారం గద్దెల ప్రాంగణానికి తాళం వేసి ధర్నా చేస్తామని తేల్చిచెప్పారు. తాజాగా.. దేవాదాయ శాఖపై మంత్రి కొండా సురేఖ కీలక సమీక్ష చేశారు. అంతేకాకుండా వివాదాన్ని పరిష్కరించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారని వెల్లడించారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారనేది వేచి చూడాలి. అయితే.. మే 29, 30 తేదీల్లో మేడారం గద్దెల ప్రాంగణానికి తాళం వేసి ధర్నా చేపడతామనడంతో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# అమ్మకానికి ఆడబిడ్డ

- ఖరీదు రూ.4,50 లక్షలు
- ఆర్ఎంపీతో సహా ముఠా అరెస్ట్

**తెలంగాణ ప్రభ, మేడ్చల్ :** మూడు నెలల పసికందును విక్రయిస్తున్న ముఠాని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అక్షర జ్యోతి ఫౌండేషన్



కి చెందిన మహిళలు తమకు ఆడిపిల్ల కావాలని స్ట్రింగ్ ఆపరేషన్ చేశారు. దీంతో మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిరామకృష్ణ నగర్ లో శోభారాణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లో ఆర్ఎంపీ వైద్యురాలు శోభారాణి ఈ పని చేస్తుందని ఆమెని సంప్రదించారు. అమ్మాయి ని రూ.4.50( నాలుగున్నర) లక్షలకు ఇప్పిస్తానని ఫోన్ ద్వారా చెప్పింది.ఈ క్రమంలో ముందుగా రూ.10 వేలు అడ్వాన్స్ గా చెల్లించి, బుధవారం పాపకోసం వారు క్లినిక్ కు వచ్చారు. అక్కడకు ఓ మహిళా పాపతో వచ్చి వీరికి అప్పగించింది. దీంతో సంస్థ మహిళలు పోలీసులకు, మీడియాకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని వీరందరిని పోలీస్ స్టేషనకు విచారణ కోసం తరలించారు. పేద కుటుంబం పిల్లలను పోషించడం భారమని తల్లి చెప్పడంతో మానవత్వంతో అమ్మాయిని పిల్లలు లేనివారికి విక్రయించానని శోభరాణి చెప్పడం కోసమెరుపు. శోభారాణి ఇంకా కొన్ని హాస్పిటల్ పేర్లు, చిలకనగర్ లో మరో మహిళా ఆర్ఏంపీ, మ్యారేజ్ బ్యూరో మహిళా పేర్లను వారి వివరాలను కూడా తెలియజేసినట్టు సమాచారం. వీరందరు కలిసి ఈ పని చేసినట్టు తెలియజేసింది.

# కారులో ఊపిరాడక చిన్నారి మృతి

## మణుగూరు మండలంలో విషాదం

**తెలంగాణ ప్రభ, భద్రాద్రి కొత్తగూడెం :** కారు డోర్ లాక్ కావడంతో ఊపిరాడక ఓ చిన్నారి తుది శ్వాస విడిచింది. ఈ విషాద ఘటన మణుగూరు మండలం సాంబాయిగూడెంలో వెలుగు చూసింది. సాంబయ్య గూడెంలో మడకం సాయి, లిఖిత కుటుంబం నివాసం ఉంటుంది. వీరికి కల్నిష అనే మూడేళ్ల చిన్నారి ఉంది. అయితే మంగళ వారం సాయంత్రం తల్లి లిఖిత నిద్రపోతున్న సమయంలో కల్నిష ఇంటి బయట నిలిచిన కారు ఉన్న ప్రాంతంలో తోటి పిల్లలతో ఆడుకుంటుంది. అయితే అక్కడే ఉన్న కారులోకి కల్నిషా ఎక్కి ఆడుకుంటుంది. ఈ క్రమంలో కారు డోర్లు ఇక్కసారిగా పడి లాక్ అయ్యాయి. అక్కడే ఆడుకుంటున్న పిల్లలు కూడా కల్నిషా కారులో ఉన్నట్లు గమనించిలేదు. దీంతో కారులో కల్నిష ఊపిరాడక స్పృహ తప్పింది. సాయంత్రం గాలి దుమ్ములు రావడంతో తల్లిదండ్రులు తమ పాప లేదని వెతుక్కుంటూ బయటకు వచ్చారు. పాప కనిపించలేదు. చివరికి కార్‌లో స్పృహ తప్పిన పాపను గమనించి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ప్రమాదవశాత్తు మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



